వార్షిక క్రీడా పోటీలు ప్రారంభం



మార్చ్ ఫాస్ట్ చేస్తున్న విద్యార్థులు

గోల్కొండ: డిలక్స్ కాలనీలోని వీనస్ హై స్కూల్ వార్షిక క్రీడా పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్ చేస్తూ అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మహ్మద్ హిదాయత్ ఆలీ మాట్లాడుతూ.. ఎప్పుడు పుస్తకాలతో కుస్తీపట్టే విద్యార్థులకు తాము మూడు రోజుల పాటు వివిధ రకాల క్రీడాపోటీలు నిర్వహించి వారిలో నూతన ఉత్సాహం నింపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

వ్యాస రచన పోటీలకు ఆహ్వానం

సుల్తాన్‌బజార్: సుప్రసిద్ధమైన నర్సింహ శతక కర్త ధర్మపురి శేషప్ప కవి జీవితం, సాహిత్యంపై తెలంగాణ సారస్వత పరిషత్ వ్యాస రచన పోటీ నిర్వహిస్తుందని పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల యువతీయువకులు ఈ పోటీల్లో పాల్గొన వచ్చని తెలిపారు. వ్యాసం నిడివి 10 పుటలకు మించరాదని, తమ సొంత రచన అని స్వీయ ధృవీకరణ ఉండాలని తెలిపారు. ఫిబ్రవరి 15వ తేదీలోగా చేరే విధంగా తెలంగాణ సారస్వత పరిషత్ చిరునామాకు పంపాలని కోరారు.

టీజీసీజీటీఏ డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న భట్టి విక్రమార్క, డాక్టర్ సురేందర్‌రెడ్డి, డాక్టర్ పావని

నాంపల్లి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కళాశాలల గెజిటెడ్ అధ్యాపక సంఘం నూతన సంవత్సరం డైరీ–2025ను బుధవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి, బెల్లి యాదయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.చిన్న, మహిళా కార్యదర్శి డాక్టర్ ఈ.పావని, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ తిరుపతయ్య, డాక్టర్ మహేష్, డాక్టర్ రాజారాం, డాక్టర్ రామకృష్ణారెడ్డి, డాక్టర్ విద్యా సాగర్, సత్యనారాయణ రెడ్డి, వెంకన్న, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గృహిణి అదృశ్యం



సబా బేగం

గౌలిపురా: గృహిణి అదృశ్యమైన ఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై కె.శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం..తలాబ్‌కట్టా రోడ్డు నంబర్–5 ప్రాంతానికి చెందిన మహ్మద్ ఇబ్రహీం, సబా బేగం (28)లు దంపతులు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. సబా బేగంకు భర్త మహ్మద్ ఇబ్రహీంతో ఇంట్లో చిన్నపాటి గొడవ జరిగింది. మనస్తాపానికి గురైన సబా బేగం ఈనెల 21న రాత్రి 8 గంటలకు ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తిరిగి చేరుకోలేదు. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు స్థానిక ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వాకబు చేయగా ఫలితం లేకుండా పోయింది. దీనిపై కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఏటీఎం మిషన్‌ను ధ్వంసం చేసిన వ్యక్తి అరెస్ట్

సుల్తాన్‌బజార్: ఈజీ మనీ కోసం ఓ ఏటీఎంలో చోరీకి యత్నించి ఏటీఎం మిషన్‌ను ధ్వంసం చేసిన ఓ యువకుడిని సుల్తాన్‌బజార్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసచారి తెలిపిన వివరాల ప్రకారం..హనుమాన్‌టేక్డీకి చెందిన గౌతమ్‌రాజేష్ (29) వృత్తిరీత్యా క్యాంటీన్ వర్కర్. ఈ నెల 19న కోఠి బ్యాంక్ స్ట్రీట్‌లోని కొటాక్ మహేంద్ర ఏటీఎం సెంటర్‌లో చోరీకి యత్నించి డబ్బులు రాకపోవడంతో ఏటీఎం మిషన్‌ను ధ్వసం చేశారు. ఈ సమాచారం తెలుసుకున్న కొటాక్ మహేంద్ర మేనేజర్ రామ్‌భూపాల్ చౌదరి సుల్తాన్‌బజార్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు సీసీ పుటేజీ ఆధారంగా నిందితుడు గౌతమ్ రాజేష్‌ను అరెస్టు చేసి అతని వద్ద ఉన్న ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు

- 6671 మందితో జాబితాను సిద్ధం చేశాం
- సర్కిల్–5 సహాయ కమిషనర్ బుస్రా సుల్తానా



అర్హులందరికీ రేషన్ కార్డులు తప్పక మంజూరవుతాయని..ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రజా పౌర సరఫరాల శాఖ సర్కిల్–5 సహాయ కమిషనర్ బుస్రా సుల్తానా పేర్కొన్నారు. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని వారు ఎవరైనా ఉంటే త్వరలో జరిగే వార్డు సభల్లో మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. రేషన్ కార్డు కోసం ఎవరూ దళారులను ఆశ్రయించొద్దని కోరారు. బుధవారం ఆమె 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరాలను వెల్లడించారు. నాంపల్లి

రేషన్‌కార్డు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు ఎవరు?
ప్రభుత్వ ఉద్యోగం ఉన్న వారు, సొంతకార్లు కలిగిన వారు, వంద గజాల స్థలంలో పక్కా ఇళ్లు ఉండేవారు, రూ.2 లక్షల వార్షికాదాయం కలిగిన వారు రేషన్ కార్డులు పొందుటకు అనర్హులు. మిగతా వారందరూ రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

దరఖాస్తుతో పాటు ఏమేమి ధ్రువపత్రాలు జత చేయాలి?
దరఖాస్తుతో పాటుగా ఆధార్‌కార్డు, కరెంట్ బిల్లు జత చేసి ఇవ్వాలి.

ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకోని వ్యక్తులు ఎక్కడ దరఖాస్తు చేసుకోవాలి?
త్వరలో గ్రేటర్ హైదరాబాద్‌లో ప్రతి వార్డులో వార్డు సభలు జరుగుతాయి. ఈ సభల్లో కొత్త కార్డు కోసం, మార్పులు, చేర్పుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

ఇప్పటి వరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? వీటిలో అర్హత కలిగిన వారెందరు?
ఇప్పటి వరకు 7200 దరఖాస్తులు అందాయి. వీటిలో 6671 మందితో జాబితాను సిద్ధం చేశాం.

గత ప్రభుత్వ హయాంలో దరఖాస్తు చేసుకున్న వాటి పరిస్థితి ఏమిటి? వాటిని పరిగణనలోకి తీసుకుంటారా?
అన్నింటిని పరిగణలోనికి తీసుకుంటాం. ఏ ఒక్కరిని వదిలిపెట్టం. అర్హత కలిగి ఉంటే కొత్త రేషన్ కార్డును జారీ చేస్తాం. ఇది నిరంతర ప్రక్రియ.

వార్డు సభలు ఎప్పుడు జరిగే అవకాశం ఉంది?
జిల్లాల్లో గ్రామ సభలు జరుగుతున్నాయి. గ్రేటర్ హైదరాబాద్‌లో నాకు తెలిసి ఫిబ్రవరి మొదటి వారంలో జరిగే అవకాశం ఉంది.

ఇంటింటి సర్వే పూర్తయిందా? ఏయే శాఖల అధికారులు సర్వే చేస్తున్నారు?
రేషన్ కార్డుల కోసం ఇంటింటి సర్వే కొనసాగుతోంది. రెవెన్యూ, మున్సిపల్, సివిల్ సప్లయ్ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది సర్వే చేస్తున్నారు.

సర్కిల్–5 పరిధిలో ఎన్ని రేషన్ కార్డులు ఉన్నాయి? ఎంత మంది డీలర్లు ఉన్నారు?
మొత్తం 81395 రేషన్ కార్డులు ఉన్నాయి. 82 మంది డీలర్లు ఉన్నారు. 32,1044 మంది బెనిఫిషరీస్ ఉన్నారు.

రెండు రాష్ట్రాల్లో రేషన్ కార్డులు కలిగిన వారిని ఎలా గుర్తిస్తారు?
కొన్ని మురికివాడల్లో బయటి రాష్ట్రాల నుంచి వచ్చి స్థిరపడిన వారు ఉన్నారు. వారు అక్కడ రేషన్ కార్డు కలిగి ఉంటారు. ఆధార్ కార్డును ప్రామాణికంగా తీసుకుని కార్డును మంజూరు చేస్తాం. కాబట్టి రెండేసి కార్డులు పొందేందుకు వీలుండదు. ఇక్కడ ఉంటే అక్కడ అర్హత కోల్పోతారు. అక్కడ ఉంటే ఇక్కడ అనర్హులు అవుతారు.

పౌరులకు మీరిచ్చే సలహా ఏమిటీ?
రేషన్ కార్డు లేదని ఎవరూ చింతించాల్సిన అవసరం లేదు. అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు అందజేస్తాం. ఇప్పటికే ఒక జాబితాను సిద్ధం చేశాం. గత ప్రభుత్వంలో, ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకోని వారు ఇంకా ఎవరైనా ఉంటే త్వరలో జరిగే వార్డు సభల్లో దరఖాస్తు చేసుకోవాలి.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

లంగర్‌హౌస్: విద్యుత్ మరమ్మతుల కారణంగా మెహిదీపట్నం విద్యుత్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్‌సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. 32/11 కేవీ గోల్కొండ సబ్‌స్టేషన్ ఫీడర్ పరిధిలోని ఎస్‌ఎ కాలనీ, ఫ్రైడ్ అండ్ సాండ్స్ కాలనీ, నదీంకాలనీ, యూన్సీనగర్, సమతా కాలనీ, జమాలి కుంట, అరుణకాలనీ, కులీకుతుబ్‌షా నగర్, గ్రామర్ కాలనీ, సనా హోటల్, అరవింద్‌నగర్, అజీజ్ బాగ్, రాహుల్ కాలనీ, రెయిన్‌బో అపార్ట్‌మెంట్స్, కౌసర్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

అత్తాపూర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో..
చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని చార్మినార్ సీబీడీ ఏఈఈ ఓ ప్రకటనలో తెలిపారు. అత్తాపూర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 3:45 గంటల వరకు నంది ముసలాయిగూడ, ఎస్సీ నగర్, మారుతీ నగర్, అత్తాపూర్, రాంబాగ్, తేజేశ్వరి నగర్, భరత్ నగర్ కాలనీ, పీకేఆర్ కాలనీ, హుడా కాలనీ, శివాజీ నగర్, సిక్ చావుని, నౌ నెంబర్ రోడ్, పాండురంగ నగర్, సీబీఐటీ కాలనీ, శివాజీ నగర్, సీసీఎండీ, సోమిరెడ్డి నగర్, ఏసియన్ థియేటర్, పటేల్ హోటల్, వీకర్ సెక్షన్ కాలనీ, కిషన్ బాగ్, నజంనగర్, హర్ష మహల్, జలాల్ బాబా నగర్, షరీఫ్ నగర్, మహమూద్ నగర్, ఎంఎ కాలనీ, అసద్ బాబా నగర్, బహదూర్పురా తదితర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందన్నారు.

విద్యార్థులకు అండగా మజ్లిస్: ఎమ్మెల్యే కౌసర్



ఎమ్మెల్యే కౌసర్, కార్పొరేటర్ తదితరులను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మజ్లిస్ పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. బుధవారం రంగారెడ్డి, మెదక్, నారాయణఖేడ్, జహీరాబాద్ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన మజ్లిస్ నాయకులు బుధవారం హకీంపేట్‌లో ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..15 ఏళ్ల నుంచి మజ్లిస్ పార్టీ 10వ తరగతి విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేస్తుందన్నారు. గతంలో కేవలం హైదరాబాద్ నగరానికే పరిమితమైన ఈ కార్యక్రమం తెలంగాణ జిల్లాలకు కూడా విస్తరించిందన్నారు. స్టడీ మెటీరియల్ కావాల్సిన వారు నేరుగా తనను గానీ, మజ్లిస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో గానీ సంప్రదించవచ్చునని ఆయన సూచించారు. అనంతరం ఆయన రంగారెడ్డి, నారాయణఖేడ్, మెదక్ ప్రాంతాల నుంచి వచ్చిన మజ్లిస్ నాయకులకు అక్కడి విద్యార్థుల కోసం స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, గౌస్ పాషా షేక్, మహ్మద్ ఫాజిల్, ఇర్షాక్ సైఫ్ తదితరులున్నారు.

ఎగ్జిబిషన్‌లో అందుబాటులో రెండు ఫైర్ ఇంజన్లు



వివరాలు వెల్లడిస్తున్న వినయ్‌కుమార్ ముదిరాజ్, రవిశంకర్

అబిడ్స్: ఎగ్జిబిషన్‌లో 24 గంటల పాటు రెండు ఫైర్ ఇంజన్లు అందుబాటులో ఉంటాయని ఎగ్జిబిషన్ సొసైటీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సబ్ కమిటీ కన్వీనర్ ఎన్. వినయ్‌కుమార్ ముదిరాజ్, జాయింట్ కన్వీనర్ ఎం.రవిశంకర్లు వివరించారు. 46 రోజుల పాటు కొనసాగే ఎగ్జిబిషన్‌లో ఎలాంటి ప్రమాద విపత్తులు సంభవించకుండా నిరంతర పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. బుధవారం వారి కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ..ఎగ్జిబిషన్‌లో 1,50,000 లీటర్లతో కూడిన రెండు వాటర్ ట్యాంక్‌లను అందుబాటులో ఉంచామన్నారు. 80 హైడెన్స్ ద్వారా ఎలాంటి ప్రమాదమైన క్షణాల్లో అదుపులోకి తేవచ్చని వారు అన్నారు. హైడ్రింట్ల ద్వారా వాటర్‌ను హై ప్రెషర్ ద్వారా ఫైరింజన్లు ఎలాంటి విపత్తులైన అదుపులోకి తీసుకువస్తాయని తెలిపారు. అగ్నిమాపక శాఖ డీఎఫ్ఓ వెంకన్న ఆధ్వర్యంలో 42 మందికి ఫైర్ శిక్షణ ఇచ్చారని పేర్కొన్నారు. ఫైర్ ఆక్సిడెంట్లు, ఫైర్‌కు సంబంధించిన ఎలాంటి సంఘటనలు ఎలా నివారించాలి, ఎలా అదుపులోకి తేవాలి అనే అంశంపై డీఎఫ్ఓ వెంకన్న వారికి శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు కూడా అందజేశారని తెలిపారు. 42 మందితో పాటు మరింత మంది డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ద్వారా సేవలందిస్తున్నట్లు వినయ్‌కుమార్ ముదిరాజ్, రవిశంకర్ వెల్లడించారు.

క్రీడారంగ అభివృద్ధికి ప్రాధాన్యం



క్రీడాకారులతో మాజీ ఎంపీ వీహెచ్, మమతా సంతోష్‌గుప్తా తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడారంగ అభివృద్ధికి ఎంతో ప్రాధాన్యమిస్తుందని మాజీ ఎంపీ వి.హన్మంతరావు అన్నారు. క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 18వ రాజీవ్‌గాంధీ అండర్–19 టీ–20 క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం ఎల్బీస్టేడియంలో ప్రారంభించారు. మూడు రోజుల పాటు ఈ పోటీలు జరుగుతాయని ముగింపు వేడుకలకు సీఎం రేవంత్‌రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు హాజరవుతారని వీహెచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మమతా సంతోష్‌గుప్తా, లక్ష్మణ్ యాదవ్, శ్రీకాంత్ గౌడ్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

రెజ్లింగ్ పోటీలు ప్రారంభం

గోల్కొండ: రెజ్లింగ్‌కు రోజురోజుకూ ఆదరణ పెరుగుతోందని ఎనుముల కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం గుడిమల్కాపూర్ రాజలింగయ్య కబడ్డీ స్టేడియంలో మొదటి మాదేల రాజాస్వామి రెజ్లింగ్ పోటీలను ఆయన ప్రారంభించారు. అశోక్ పహిల్వాన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ..హైదరాబాద్ నుంచి యువ రెజ్లర్లు జాతీయ, అంతర్జాతీయంగా రాణిస్తున్నారన్నారు. తెలంగాణ ప్రభుత్వం రెజ్లింగ్‌కు ఉన్న ఆదరణను చూసి మరిన్ని రెజ్లింగ్ ఇండోర్ స్టేడియంలను ప్రారంభించాల్సిన అవసరం ఉందన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో వివిధ కేటగిరీల విజేతలకు బహుమతులు అందిస్తామని అశోక్ పహిల్వాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్టు సాయి కుమార్, బీజేవైఎం నాయకులు దేవర వంశీ తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న కృష్ణారెడ్డి

వ్యర్థాల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



రాంలీలా మైదానంలో వ్యర్థాలను తొలగించిన దృశ్యం

లంగర్‌హౌస్: నెలలుగా పేరుకుపోయిన వ్యర్థాలను ఎట్టకేలకు తొలగించారు. లంగర్‌హౌస్ రాంలీలా మైదానంలో గత దసరా, బోనాల సందర్భంగా ఉపయోగించి రావణాసురుని దహన విగ్రహం, అమ్మవారి తొట్టెలలను అలాగే పెట్టారు. నెలలు గడుస్తున్నా వాటిని తొలగించకపోవడంతో 'నిర్లక్ష్యానికి..నిదర్శనం'అనే శీర్షికతో 'సాక్షి'లో ఈ నెల 20వ తేదీన కథనం ప్రచురితమయ్యింది. దీనికి స్పందించిన అధికారులు ఆ వ్యర్థాలను తొలగించి పూర్తిగా ఆ ప్రాంతాన్ని శుభ్రం చేశారు.

నేడు జాబ్ మేళా

విజయనగర్‌కాలనీ: హైదరాబాద్ జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో నేడు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి అధికారి అమర్లపురి వందన బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని ప్రముఖ ప్రైవేటు సంస్థల్లోని ఖాళీల భర్తీకి ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 10వ తరగతి, ఇంటర్మీడియేట్, ఏదైనా డిగ్రీ విద్యార్హత కలిగి ఉండి 18 ఏళ్లు నిండిన వారు అర్హులు. ఆసక్తి అర్హత గల అభ్యర్థులు గురువారం ఉదయం 11 గంటలకు విజయనగర్ కాలనీలోని హైదరాబాద్ జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఫొటోలు, ధ్రువీకరణ పత్రాలతో నేరుగా హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు 83318 54300, 83284 28933 లలో సంప్రదించవచ్చు.

జాతీయ యువజన అవార్డు–2025కు డాక్టర్ దివ్య సల్లా సింగ్ ఎంపిక



చార్మినార్: ప్రముఖ పీడియాట్రిక్ ఫిజిషియన్, కథక్ నృత్య కళాకారిణి డాక్టర్ దివ్య సల్ల సింగ్‌ను జాతీయ యువజన అవార్డు–2025కు ఎంపిక చేసినట్టు తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయన్ ముదిరాజ్ ఓ ప్రకటనలో తెలిపారు. స్వామి వివేకానంద 162వ జయంతి ముగింపు ఉత్సవాలను పురస్కరించుకొని నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేయనున్నామన్నారు. భాస్కర్ మెడికల్ కాలేజ్ నుంచి ఎంబీబీఎస్ పట్టా పొంది, అపోలో మెడ్ వర్సిటీ నుంచి ఫెలోషిప్ ఇన్ పీడియాట్రిక్స్ పట్టా పొందిన ఆమె పాతబస్తీలో శృతి డే కేర్ సెంటర్‌లో నిరుపేదలకు వైద్య రంగంలో సేవలు అందిస్తున్నారన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

లంగర్‌హౌస్: ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఓ బాలుడు మృతి చెందిన ఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం..నేపాల్‌కు చెందిన శేర్ బహదూర్ రెండేళ్ల క్రితం హైదరాబాద్ వచ్చి వాచ్‌మెన్‌గా పనిచేస్తూ బహదూర్‌పురాలో ఉంటున్నాడు. పిల్లలకు కూడా ఉపాధి చూపడానికి 10 రోజుల క్రితం తన భార్య ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలను నగరానికి పిలిపించాడు. సాలార్జంగ్ కాలనీలో నివాసం ఉండే నేపాల్‌కు చెందిన సురేష్‌తో పాటు 8 మంది స్నేహితులు పాతబస్తీలోని ఓ హోటల్‌లో పని చేస్తున్నారు. బహదూర్ కుమారుడు తపేంద్ర బహదూర్(16) మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు ఇంటి నుంచి వారి వద్దకు బయల్దేరి వెళ్లాడు. అర్ధరాత్రి తరువాత సురేష్ స్నేహితులు వారు పనిచేసే హోటల్ యజమానుల ద్విచక్ర వాహనాలను తీసుకొని సాలార్జంగ్‌కాలనీలోని అద్దె ఇంటికి వచ్చారు. అక్కడ తపేంద్ర, సురేష్ రెండు ద్విచక్ర వాహనాలను టోలిచౌకీ వైపు వెళ్తుండగా అదుపు తప్పి ఫ్లై ఓవర్‌ను ఢీకొట్టాడు. తీవ్రగాయాలైన తపేంద్రను చికిత్స నిమిత్తం గోల్కొండ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రూ.13.50 లక్షలతో అభివృద్ధి పనులు



పనులు ప్రారంభిస్తున్న శ్యాంరావు ముదిరాజ్

చాంద్రాయణగుట్ట: నల్లవాగు హిందూ శ్మశాన వాటికలో మౌలిక సదుపాయాల కల్పనకు జీహెచ్‌ఎంసీ తరపున నిధులు మంజూరు చేయడం హర్షణీయమని గ్రేటర్ కాంగ్రెస్ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాశమోని శ్యాంరావు ముదిరాజ్ అన్నారు. శ్మశాన వాటికలో రూ.13.50 లక్షలతో చేపట్టనున్న ఫుట్‌పాత్, ప్రహరీ, పైప్‌లైన్ తదితర పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ..శ్మశాన వాటిక బయట కొద్ది దూరం పాటు ఫుట్‌పాత్ లేకపోవడంతో అంత్యక్రియలకు వచ్చే వారికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కొన్ని ప్రదేశాల్లో ప్రహరీ సైతం శిథిలావస్థలో కూలడంతో రోడ్డున పోయే వారు చెత్తా చెదారాలను శ్మశానంలో పడేస్తున్నారన్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లిన వెంటనే నిధులు చేయడం మంజూరు చేయడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాగర సంఘం ప్రతినిధులు ఆర్.మధు, దేవేందర్, రవి, టింకు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఫలక్‌నుమా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మోహన్ రావు

చాంద్రాయణగుట్ట: విద్యార్థులు రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా పాఠశాల దశలోనే రోడ్డు భద్రతా విషయాలపై పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని ఫలక్‌నుమా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రావు సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా బండ్లగూడ ఆర్టీఏ అధికారులతో కలిసి శంషీర్‌గంజ్‌లోని శారదా విద్యాలయ, ఎంజేఎం పాఠశాలలకు విద్యార్థులకు బుధవారం ట్రాఫిక్ భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఎల్లప్పుడు రోడ్డుకు ఎడమ వైపునే నడవాలన్నారు. రోడ్డు దాటేటప్పుడు అటు ఇటు చూసుకుంటూ జీబ్రా క్రాసింగ్ వద్దే దాటాలన్నారు. ఈ కార్యక్రమంలో టీటీఐ ఇన్‌స్పెక్టర్ రాంచందర్, ఆర్టీఏ ఎంవీఐ జె.సురేష్ కుమార్, చార్మినార్ డిప్యూటీ తహసీల్దార్ శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జంగయ్య సేవలు చిరస్మరణీయం



నివాళులర్పిస్తున్న రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, ఆలయ కమిటీ సభ్యులు

యాకుత్‌పురా: హరిబౌలీ అక్కన్న మాదన్న ఆలయ కమిటీ మాజీ కోశాధికారి ఎడ్ల జంగయ్య ఆలయానికి చేసిన సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ కొనియాడారు. జంగయ్య వర్ధంతి సందర్భంగా బుధవారం ఆలయం వద్దనున్న ఆయన విగ్రహాన్నికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యాక్రమంలో జాతీయ ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు కే.రాములు, ఆలయ కమిటీ అధ్యక్షుడు జగన్మోహన్ కపూర్, కార్యదర్శి దత్తత్రేయ, కోశాధికారి ఎడ్ల సతీష్ కుమార్, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మాదిగ విద్యార్థి యువ గర్జన పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పిడమర్తి రవి తదితరులు

గన్‌ఫౌండ్రీ: మాదిగలు డప్పులు కొట్టే..చెప్పులు కుట్టే కార్యక్రమాలను బంద్ చేసి భారత రాజ్యాంగాన్ని పట్టుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి అన్నారు. బుధవారం బషీర్‌బాగ్ చౌరస్తాలో ఫిబ్రవరి 2న ఓయూలో జరిగే మాదిగ విద్యార్థి యువ గర్జన బహిరంగ సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణలో మాదిగల జనాభా 12 శాతం ఉందని జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను పెంచాలని డిమాండ్ చేశారు. మాదిగ సామాజిక వర్గాన్ని మందకృష్ణ మాదిగ, మాల సామాజిక వర్గాన్ని వివేక్ రెచ్చగొడుతూ పబ్బం గడుపుతున్నారని వీరిద్దరి మాటలను వినొద్దని మాల మాదిగలకు సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌తోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ దళితబంధు వర్కింగ్ ప్రెసిడెంట్ మొగులయ్య, మాదిగ రాజకీయ వేదిక అధ్యక్షుడు సోమ చంద్రశేఖర్, బీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

లిథియం అయాన్ బ్యాటరీల వినియోగం పర్యావరణ హితం



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాస్ ఆనందన్

చార్మినార్: లిథియం అయాన్ బ్యాటరీల వినియోగం వల్ల కార్బన్ వాయువుల విడుదల గణనీయంగా తగ్గి పర్యావరణ హితంగా ఉంటుందని ప్రముఖ ఏఆర్‌సీఐ భౌతిక శాస్త్రవేత్త డా.శ్రీనివాస్ ఆనందన్ అన్నారు. బుధవారం ప్రభుత్వ సిటీ కాలేజీ భౌతిక శాస్త్ర విభాగం నిర్వహించిన ఆహ్వానిత ప్రసంగ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. దేశీయంగా లిథియం అయాన్ బాటరీలను తయారు చేసి, వాటిని ప్రయోగశాల నుంచి మార్కెట్‌లోకి తీసుకురావడం, తయారీలో ఎదురయ్యే సవాళ్లను గురించి ఆయన వివరించారు. ప్రిన్సిపాల్ ఆచార్య బాల భాస్కర్ మాట్లాడుతూ.. మొబైల్ త్వరితంగా చార్జ్ అయ్యి, నెమ్మదిగా డిశ్చార్జ్ ఉండే విధంగా బ్యాటరీ తయారీలో ప్రయోగాలు చేస్తున్న ఎఆర్‌సీఐ శాస్త్రవేత్తలను అభినందించారు. భౌతిక శాస్త్ర విభాగ అధ్యక్షులు డా.నైన వినోదిని సంప్రదాయేతర శక్తి వనరుల గురించి అధ్యయనం చేయాలన్నారు. డా.కె.పర్వతాలు కార్యక్రమాన్ని సమన్వయం చేస్తూ శక్తి వనరుల అభివృద్ధి దేశ ప్రగతికి తోడ్పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రతన్ కుమార్, డా.లక్ష్మీ శ్రీనివాస్, డా.చిన్ని కృష్ణ, సూజిత్, విజయ నిర్మల తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.